
సాక్షి బాపట్ల

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025




పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: 'ఒక కుటుంబం-ఒక వ్యాపారవేత్త' కార్యక్రమ పోస్టర్‌ను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా గురువారం ఆవిష్కరించారు.



సాగర్ క్రస్ట్‌గేట్లు మూసివేత

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నీరు తగ్గడంతో గురువారం క్రస్ట్‌గేట్లు మూసివేశారు. ప్రస్తుతం నీటిమట్టం 589.30 అడుగులు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 53,355 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 53,355 క్యూసెక్కులు వదులుతున్నారు.

న్యూస్‌రీల్

మిర్చి యార్డును సందర్శించిన గుంటూరు జిల్లా కలెక్టర్



కొరిటిపాడు(గుంటూరు వెస్ట్): జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా గురువారం జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి గుంటూరు మిర్చి యార్డులో పర్యటించారు. క్రయవిక్రయాలు, ఎగుమతి వ్యాపారుల వరకు జరిగే ప్రక్రియను పరిశీలించారు. యార్డులో కార్యకలాపాలను మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి, యార్డు ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం, పలువురు వ్యాపారులు వివరించారు. 415 మంది వ్యాపారులు ఉన్నారని తెలిపారు. సీజన్‌లో రోజుకు రెండు లక్షల బస్తాల వరకు సరుకు వస్తుందని, మిగిలిన కాలంలో 50 వేల బస్తాల వరకు వస్తాయని వివరించారు. చైనా, థాయిలాండ్, కొలంబో, ఇండోనేషియా, మలేషియా తదితర చోట్లకు ఎక్కువగా ఎగుమతులు జరుగుతాయని తెలిపారు. యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గుంటూరు జిల్లాలో పోలీసుల ప్రత్యేక డ్రైవ్



నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : జిల్లాలో రాత్రుళ్లు అనవసరంగా సంచరించే వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఈ నెల 12న నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 106 మందిపై 104 కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. బుధవారం రాత్రి మళ్లీ జిల్లా వ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో డ్రైవ్ చేపట్టారు. 181 మందిపై 173 కేసులు నమోదు చేసి, కౌన్సెలింగ్ చేశారు. అనవసరంగా రాత్రుళ్లు బయటకు రావద్దని సూచించారు. చట్టాలను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

శ్రీనివాస కల్యాణంలో కేరళ డీజీపీ ఆజాద్



ఫిరంగిపురం: ఫిరంగిపురంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో గురువారం శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణంలో కేరళ రాష్ట్ర డీజీపీ చంద్రశేఖర్ ఆజాద్ దంపతులు పాల్గొన్నారు. ఆజాద్ దంపతులకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కల్యాణ వేదికపై ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు పూజలు నిర్వహించారు. అనంతరం మూలమూర్తులకు తలంబ్రాలు నిర్వహించారు. పూజా విధివిధానాల గురించి గౌరీశంకర్ వివరించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను దేవదాయశాఖ ఈఓ బి.సురేష్ పర్యవేక్షించారు. కల్యాణ వేడుకలకు కేరళ రాష్ట్ర డీజీపీ చంద్రశేఖర్ ఆజాద్ రావడంతో సీఐ శివరామకృష్ణ, ఎస్ఐ సురేష్‌ల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

పశ్చిమ డెల్టాకు 5,527 క్యూసెక్కులు



దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి 5,527 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవల్‌కి 276 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్ 1,122 క్యూసెక్కులు, తూర్పు కాలువకు 201, పశ్చిమ కాలువకు 211, నిజాంపట్నం కాలువకు 420, కొమ్మూరు కాలువకు 2,600 క్యూసెక్కులు బ్యారేజి నుండి విడుదల చేశారు. సముద్రంలోనికి 36,250 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

తీర ప్రాంతంలోని పంచాయతీల్లో కార్యదర్శుల అవినీతికి అంతే లేకుండా పోతోంది. అక్రమ లౌఅవుట్‌ల నుంచి, అక్రమ భవనాల నుంచి దొరికిన కాడికి దోపిడీ చేస్తున్నారు. అధికార పార్టీ నేతల అండ, ఉన్నత అధికారుల భరోసాతోనే వారు చెలరేగిపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.



కొత్తపేట గ్రామ పంచాయతీ కార్యాలయం

కాసుల కార్యదర్శులు

- అక్రమ లే అవుట్‌ల నుంచి అడ్డగోలుగా నగదు వసూళ్లు
- తీర గ్రామ పంచాయతీల్లో కార్యదర్శుల దందా
- సర్పంచ్‌లు లేకపోవడంతో వారిదే ఇష్టారాజ్యం
- అధికార పార్టీ నాయకుల అండదండలతో అవినీతి



వేటపాలెం: లే అవుట్లు, భవన నిర్మాణాలకు అనుమతులపై కొందరు కార్యదర్శులు ఏకంగా ఫిక్స్‌డ్ రేట్లు నిర్ణయించారు. నియోజకవర్గ పరిధిలోని వేటపాలెం మండల తీర ప్రాంత గ్రామాలు, 216 జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న పంచాయతీలలో ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. ప్రధానంగా సముద్ర తీర గ్రామాలైన రామాపురం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెంలో పర్యాటకంగా బాగా అభివృద్ధి చెందాయి. ఇక్కడ భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఎకరా రూ. 7 కోట్లు వరకు పలుకుతోంది. దీంతోపాటు 216 దిగమర్రు – ఒంగోలు జాతీయ రహదారి కూడా తీర ప్రాంత గ్రామాల మీదుగా వెళుతోంది. ఈ జాతీయ రహదారికి ఇరువైపులా భూముల ధరలు భారీగా పెరిగాయి. ఎకరా రూ. 2 కోట్లకుపైగానే పలుకుతోంది.

కొత్తపేటలో డిమాండ్..

చీరాల మున్సిపాలిటీలో కలిసిన కొత్తపేట పంచాయతీ కార్యదర్శి పోస్టుకు మంచి డిమాండ్ ఉంది. రూ.లక్షల్లో అధికార పార్టీ నాయకులకు ముడుపులు ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో ఉన్న కార్యదర్శి దాదాపు 10 ఏళ్లు కొనసాగారు. రూ. కోట్లలో అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికీ చర్యలు మాత్రం తీసుకోలేదు. ఆరు నెలల క్రితం ప్రమోషన్ రాగా, బదిలీపై వెళ్లారు. దేశాయిపేట కార్యదర్శి ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు.

డబ్బులిస్తే ఎన్‌ఓసీ..

చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో ఎక్కడ కొత్తగా భవనం, రేకులు షెడ్డు, వ్యాపార సంస్థ, బంకు ఏర్పాటు చేసుకున్నా విద్యుత్ మీటరు కోసం కార్యదర్శి ఎన్‌ఓసీ ఇవ్వాల్సి ఉంటుంది. డబ్బు ఇస్తే చాలు ఎన్‌ఓసీ వస్తోంది. తీరప్రాంత కార్యదర్శుల అవినీతికి అధికార పార్టీ నాయకులు, కొందరు జిల్లా అధికారుల అండ ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పూర్తి స్థాయిలో విచారణ చేపడితే నిజాలు బయట పడతాయి.

పుట్టగొడుగుల్లా లే అవుట్‌లు..

రామాపురం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం గ్రామాల పరిధిలో అనుమతులు లేకుండా దాదాపు 40 వరకు లేఅవుట్‌లు వెలిశాయి. మరో 50 వరకు రిసార్టుల నిర్మాణాలు జరిగాయి. 216 జాతీయ రహదారికి ఇరువైపులా పంట పొలాల్లో, అసైన్డ్ భూముల్లో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్‌లు వెలిశాయి. ఇవి ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు కాసులు కురిపిస్తున్నాయి. తీరప్రాంతాల గ్రామాల పరిధిలో వందల సంఖ్యలో అనుమతి లేని లేఅవుట్‌లు ఉన్నాయి. అక్రమ లే అవుట్లకు, అక్రమ భవన నిర్మాణాలకు రేట్లు నిర్ణయించి మరీ గ్రామ పంచాయతీ కార్యదర్శులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్త భవనాలకు ఆస్తి పన్ను విధింపునకు కూడా చేయి తడపాల్సి వస్తోంది. మండల, డివిజనల్ పంచాయతీ అధికారులు కూడా కాసులకు కక్కుర్తిపడి పట్టించుకోవడం లేదు.

రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వకు చర్యలు

జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్



కూచిపూడిలో రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

అమర్తలూరు(వేమూరు): ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని రైస్ మిల్లుల్లో నిల్వ చేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. వేమూరు నియోజక వర్గంలోని అమృతలూరు మండలంలోని కూచిపూడి రైస్ మిల్లును, రైతు సేవ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరించి మిల్లుల్లో, రైతు సేవ కేంద్రాల్లో నిల్వ చేయడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి మండలంలో ధాన్యం కొనుగోలుకు రైస్ మిల్లులను ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఆర్‌డీఓ రామలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, అమృతలూరు తహసీల్దారు నెహ్రూబాబు, ఎంపీడీవో మారుతి శేషాంబ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూసేకరణ పనులలో వేగం పెంచండి

బాపట్ల: గుండ్లకమ్మ ప్రాజెక్ట్ భూసేకరణ పనులో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. ప్రాజెక్టుపై సంబంధితశాఖల అధికారులతో గురువారం కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ప్రాజెక్ట్ కింద 50 ఎకరాల భూసేకరణ చేయకపోవడంతోనే జిల్లాలో 13,876 ఎకరాలకు సాగునీరు రావడం లేదని కలెక్టర్ చెప్పారు. ఇంకొల్లు మండలం దుద్దుకూరు గ్రామంలో 50 ఎకరాల భూసేకరణ పనులు నిలిచిపోవడంపై ఆరా తీశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ 14 గేట్లు మరమ్మతులు పూర్తి కాగా, మిగతా పనులు జరుగుతున్నాయన్నారు. వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. తాజాగా జిల్లాలో 2,600 ఎకరాల ఆయకట్టు పరిధిలోకి తీసుకురావడానికి గజిట్ విడుదల చేయాల్సి ఉందన్నారు. మరో 78 ఎకరాలు ఆయకట్టులోకి తెచ్చేందుకు అధికారులు పరిశీలన చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ వారంలో పూర్తి చేయాలన్నారు. కొరిశపాడు, అద్దంకి మండలాలలోని మూడు గ్రామాలలో 1,100 కుటుంబాలకు పునరావాసం కింద ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఆర్డీవో, తహసీఅల్దారులకు సూచించారు. ప్రాజెక్టు ఎస్ఈ అబూతలీమ్, ఆర్డీవో చంద్రశేఖర్, ఉప కలెక్టర్లు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

బాపట్ల: పరిశ్రమల భాగస్వాముల ప్రేరణ కార్యక్రమాలు జిల్లాలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. సదస్సును పురస్కరించుకొని రూపొందించిన గోడ పత్రాలను గురువారం కలెక్టరేట్లో ఆయన విడుదల చేశారు. పెట్టుబడిదారుల భాగస్వాముల సదస్సు నవంబర్ 14, 15వ తేదీలలో విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని కలెక్టర్ చెప్పారు. అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

ఆధార్ కార్డు తీసుకోవాలి

బాపట్ల: ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. ఆధార్ కార్డుల నమోదు, నవీకరణ ప్రక్రియపై సంబంధిత అధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలలో తక్షణమే ఈ ప్రక్రియ చేపట్టాలని చెప్పారు. ఈ నెల 23వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో ఆధార్ నవీకరణ ప్రారంభిస్తామని తెలిపారు. జిల్లాలో 110 ఆధార్ నమోదు కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం 80 మాత్రమే పని చేయడంపై ఆరా తీశారు. సచివాలయాలలో బదిలీల ప్రక్రియ నేపథ్యంలో ఏర్పడిన సాంకేతిక సమస్యలే కారణమని ఆధార్ కార్డుల రీజినల్ మేనేజర్ ప్రసాద్ తెలిపారు. డీఆర్‌వో జి.గంగాధర్ గౌడ్, డీఈవో పురుషోత్తం, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. విజయమ్మ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పి.డి. రాధా మాధవి, డీపీఓ ప్రభాకర్ రావు, ఆధార్ జిల్లా కోఆర్డినేటర్ అశోక్ బాబు, కామన్ సర్వీస్ సెంటర్ మేనేజర్ వందనం తదితరులు పాల్గొన్నారు.

వారంలో కొలిక్కి 'స్ట్రెయిట్ కట్'

- ఇప్పటికే సర్వే పూర్తి చేసిన కమిటీ అధికారులు
- కూటమి సర్కారు రాకముందు ఎల్ షేపులో కాలువ?
- ఆ తర్వాత కాలువను పూడ్చివేసిన టీడీపీ నేత

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ వివాదం త్వరలో ముగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిపై నియమించిన కమిటీ పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. కమిటీ ఉరుకులు పరుగులతో.. ఎల్ ఆకారంలోని కాలువ పూడ్చివేత, తీరం ఆక్రమణ, డీకేటీ పట్టాలు పుట్టించడం, కొండ రాళ్లను తెచ్చి స్ట్రెయిట్ కట్‌ను దారి మళ్లించడం తదితర అంశాలపై సమగ్ర విచారణ చేసింది. పాత రికార్డులను, ఉపగ్రహ ఛాయాచిత్రాలను పరిశీలించింది. కాలువ పూర్వాపరాలను సేకరించి సర్వే సైతం నిర్వహించింది. టీడీపీ నేత చూపిన డీకేటీ పట్టాలపైనా విచారణ చేపట్టారు. ఈ వారంలో కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చే వరకూ ఈపూరుపాలెం స్ట్రెయిట్‌కట్ ఎల్ ఆకారంలో ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. ఎల్ ఆకారంలో ఉన్న కాలువను సీమౌత్ వద్ద పూడ్చి వేయడం వల్ల తీరంలో దాదాపు పది ఎకరాల భూములను టీడీపీ త ఆక్రమించినట్లు ఆరోపణలున్నాయి. ఆక్రమిత తీరం భూములకు డీకేటీ పట్టాలు పుట్టించినట్లు కూడా సమాచారం. ఈ విషయాన్ని అధికారులు గుర్తించారని తెలిసింది. నిష్పాక్షికంగా నివేదిక సమర్పిస్తే మత్స్యకారులు విజయం సాధించినట్లే అవుతుంది.

పచ్చనేత ఒత్తిడి

విచారణను టీడీపీ నేత అడుగడుగునా అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది. ఉన్నతస్థాయిలో ప్రయత్నం సాగిస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితిలో కమిటీ నివేదిక నిష్పాక్షికంగా ఉంటుందా? లేక ప్రభుత్వ వత్తిళ్లకు లోనై పచ్చనేతకు అనుకూలంగా వ్యవహరిస్తారా? అనే విషయంపై మత్స్యకారుల్లో అనేక అనుమానాలున్నాయి. కొత్తగా వచ్చిన జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌పై మత్స్యకారులు విశ్వాసంతో ఉన్నారు. అదే జరిగితే ఈపూరుపాలెం స్ట్రెయిట్‌కట్ వివాదం ఇంతటితో సర్దుమణిగే అవకాశం ఉంది. దాదాపు 12 వేల కుటుంబాల మత్స్యకారులు ఈ కాలువ ద్వారా చేపల వేట కొనసాగిస్తున్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదన రెడ్డి
- 'కోటి సంతకాల సేకరణ' కార్యక్రమం ప్రారంభం



'కోటి సంతకాల సేకరణ' పోస్టర్ ఆవిష్కరిస్తున్న గాదె మధుసూదన రెడ్డి, నాయకులు

ఇంకొల్లు(చినగంజాం): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను కచ్చితంగా అడ్డుకుంటామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదన రెడ్డి అన్నారు. ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పోస్టరును ఆయన ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలోని తన నివాసంలో గురువారం ఆవిష్కరించారు. అనంతరం తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలని, పేద విద్యార్థులకు ఉచిత వైద్యవిద్య అవకాశాలు కల్పించాలని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను చేపట్టిన విషయం గుర్తుచేశారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక కాలేజీలను ప్రైవేటీకరించే ప్రయత్నం చేస్తోందన్నారు. వైఎస్ జగన్ మోహన రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలని కోరారు. కార్యక్రమంలో ఇంకొల్లు మండల కన్వీనర్ చిన్ని పూర్ణారావు, యద్దనపూడి మండల కన్వీనర్ రావూరి వేణుబాబు, పర్చూరు మండల కన్వీనర్ కఠారి అప్పారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బిల్లాలి డేవిడ్, నియోజక వర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నూతలపాటి బలరాం, కొల్లా వెంకట సుబ్బారావు చౌదరి, నియోజక వర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు మువ్వల రాంబాబు, బూరగ రాము, పల్లెపోగు ప్రసాద్, పులగం చందు, గోపతోటి బాబురావు, వెన్ను సురేష్, కరి వాసు, గూంటూరు శ్రీను, చిగురుపాటి శ్రీను, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు కాటి లక్ష్మణ్, నక్కా పోతిరెడ్డి, దొడ్డా రవి, దాసరి వెంకటరావు, సవరపు వందనం, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రైలు ఎక్కితే రక్షణ కరువు

- ప్రయాణికుల గుండెల్లో రైళ్లు
- పెరుగుతున్న దోపిడీలు, దొంగతనాలు
- తాజాగా ప్రయాణికురాలిపై దుండగుడి లైంగికదాడి
- సికింద్రాబాద్‌లో కేసు నమోదు.. నడికుడికి బదిలీ
- జీఆర్పీ, ఆర్పీఎఫ్‌ల్లో సిబ్బంది కొరత



నడికుడి రైల్వేస్టేషన్

దాచేపల్లి : రైలు ప్రయాణికులకు భద్రత కరువైంది. ఇటీవల జరిగిన వరుస ఘటనలతో గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. ఇటీవల ప్రయాణికుల నుంచి దుండగులు బంగారం, నగదు దోచుకున్న ఘటనలు భారీగా జరిగాయి. తాజాగా సంత్రగాచి స్పెషల్ రైలులో ప్రయాణిస్తున్న మహిళపై గుర్తు తెలియని వ్యక్తి అత్యాచారానికి పాల్పడటం తీవ్ర సంచలనంగా మారింది. రైలు ప్రయాణికుల్ని కలవరపాటుకు గురి చేసింది.

కత్తితో బెదిరించి అత్యాచారం

ఏపీకి చెందిన ఓ మహిళా ప్రయాణికురాలు(35) సోమవారం రాజమహేంద్రవరం స్టేషన్‌లో చర్లపల్లి వెళ్లేందుకు సంత్రగాచి ప్రత్యేక రైలు ఎక్కింది. ఆమె అక్కడ ఇళ్లల్లో పని చేసుకుని జీవించేందుకు వెళుతోంది. రైలు గుంటూరు స్టేషన్‌కి చేరుకున్న తరువాత మహిళా బోగీలో ఉన్న ప్రయాణికులంతా దిగిపోయారు. ఆమె ఒక్కతే మిగిలింది. బోగీలోని 40 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి ఎక్కేందుకు ప్రయత్నించగా ఆమె ఒప్పుకోలేదు. బలవంతంగా ఎక్కాడు. గుంటూరు రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరిన 20 నిమిషాల తరువాత బోగీ తలుపులు మూసివేశారు. ఒంటరిగా ఉన్న మహిళ ప్రయాణికురాలిని కత్తితో బెదిరించి, బలవంతంగా ఆత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె వద్ద ఉన్న రూ. 5,600తో పాటు సెల్‌ఫోన్, హ్యాండ్‌బ్యాగ్ లాక్కొని దాడి చేసి, పెదకూరపాడు చేరుతుండగా కిందకు దిగి పారిపోయాడు. రైలు మంగళవారం చర్లపల్లి స్టేషన్‌కు చేరుకున్న తరువాత బాధితురాలు సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. తర్వాత నడికుడి జీఆర్పీ పోలీసులకు బదిలీ చేశారు.

బెంబేలెత్తుతున్న ప్రయాణికులు

ఇటీవల నడికుడి, తుమ్మలచెరువు, పిడుగురాళ్ల, బెల్లంకొండ స్టేషన్ల పరిధిలో రైళ్లల్లో ప్రయాణికులను బెదిరించి బంగారం, నగదును దుండగులు దోచుకున్నారు. ఆగంతకులు రైళ్లను ఆపి పారిపోవడం ఆ శాఖకు సవాల్‌గా మారింది.

సిబ్బంది కొరత ప్రధాన సమస్య

రైల్వే ఆస్తులు, ప్రయాణికుల భద్రత కోసం ఏర్పాటైన జీఆర్పీ, ఆర్పీఎఫ్‌ల్లో సిబ్బంది కొరతతో ప్రయాణికులకు సరియైన భద్రత కల్పించటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. గుంటూరు రైల్వే డివిజన్‌లో రెండో అతి పెద్ద స్టేషన్ అయిన నడికుడి రైల్వే జంక్షన్‌లో ఉన్న ఆర్పీఎఫ్ కార్యాలయాన్ని పిడుగురాళ్లకు తరలించారు. నడికుడి స్టేషన్‌లోని జీఆర్పీ కార్యాలయంలో ఎస్ఐగా నరసరావుపేట స్టేషన్‌లో పని చేస్తున్న అధికారి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. స్టేషన్లలో, రైళ్లలో సరిపడా సిబ్బంది లేకపోవడం వల్ల దుండగులు యథేచ్ఛగా దోపిడీలకు పాల్పడుతున్నారు.

మొక్కజొన్న రైతుల ఆందోళన

- రూ.కోటికిపైగా వ్యాపారి చెల్లించాలని డిమాండ్
- పోలీసుల రంగప్రవేశం

మార్టూరు: కోనంకి గ్రామంలో గురువారం రాత్రి మొక్కజొన్న రైతుల ఆందోళన స్థానికంగా కలకలం రేకెత్తించింది. తమకు ఓ వ్యాపారి దాదాపు రూ.కోటికిపైగా ఇవ్వాల్సి ఉన్నా చెల్లించడం లేదని వారు వాపోయారు. బాధితుల కథనం ప్రకారం... కోనంకి గ్రామానికి చెందిన ఓ కమీషన్ వ్యాపారి మరో వ్యక్తితో కలిసి మార్టూరు, ఇంకొల్లు మండలాల్లోని సుమారు 10 గ్రామాలకు చెందిన రైతుల నుంచి గత సంవత్సరం మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేశాడు. వాటి విలువ రూ.కోటికి పైగా ఉన్నట్లు సమాచారం. వ్యాపారులు ఊరి వెలుపల గల ఓ కోళ్ల ఫాంలో సరుకు నిల్వ ఉంచారు. ఆ సరుకును హామీగా పెట్టిన స్థానిక వ్యాపారి రెండు బ్యాంకుల్లో కొంత మొత్తం రుణంగా కూడా తీసుకున్నట్లు సమాచారం. రైతులు రెండు, మూడు నెలలుగా నగదు గురించి వ్యాపారిపై ఒత్తిడి చేస్తున్నారు. అదిగో ఇదిగో.. అంటూ కాలయాపన చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. గురువారం లోనులో కొంత మొత్తాన్ని చెల్లించి బ్యాంకుల నుంచి ఎన్‌ఓసీ తీసుకుని సరుకును బయటకు తరలించేందుకు ప్రయత్నం చేశారు. విషయం తెలిసిన బాధిత రైతులు గోడౌన్ వద్దకు చేరుకున్నారు. సరుకును బయటకు తరలించకుండా అడ్డుకున్నారు. విషయం తెలిసిన పోలీసు అధికారులు కోనంకి చేరుకొని, వారిని స్టేషన్‌కు పిలిపించారు. సీఐ శేషగిరి వ్యాపారి, బ్యాంకు అధికారులు, రైతులతోనూ చర్చించారు. శుక్రవారం సమస్యను సానుకూలంగా పరిష్కరించుకోవాలని చెప్పారు.

వ్యాయామ ఉపాధ్యాయుడిపై చర్యలకు ఆదేశాలు

పట్టించుకోని బాపట్ల విద్యాశాఖాధికారులు

బాపట్ల: కర్లపాలెం మండలంలోని చింతాయపాలెంలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేసి ప్రస్తుతం వెనిగండ్ల పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఎం.గోపిపై చర్యలు తీసుకోవాలని ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 14వ తేదీన ఇవి జారీ అయినప్పటికీ బాపట్ల విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. గోపి చింతాయపాలెంలో పని చేసిన సమయంలో 2019 – జూన్ 2025 వరకు క్రీడా విద్యార్థులకు సంబంధించిన నిధులు గోల్‌మాల్ చేశారని, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కూడా నగదు వసూలు చేశారనే ఫిర్యాదు విద్యాశాఖకు చేరింది. విచారణ చేపట్టి అధికారులకు ఆ ఫిర్యాదులు నిజమేనని తెలిసింది. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్జేడీ ఆదేశాలు జారీ చేశారు. వాటిని అందుకున్న విద్యాశాఖ అధికారులు మాత్రం మౌనంగా ఉన్నారు. దీనికి సంబంధించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **1,400** గరిష్ఠం : రూ. **2,200**

మోడల్ ధర రూ. **1,800**

మిర్చి యార్డు సమాచారం

(గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	53,310
అమ్మకాలు	56,640
నిల్వ	11,920

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–15,000
నంబరు–5	10,000–14,500
273	10,500–13,700
341	10,000–15,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–15,000
నంబరు–5	10,000–14,580
341	10,000–15,600
సూపర్–10	10,000–14,700

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,200
బాడిగ–355	10,500 – 15,800
దేవనూరు డీలక్స్	10,000 – 14,700
ఆర్మూర్	10,000 – 12,500
తాలుకాయలు	5,500 – 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–15,000
బాడిగ – 355	10,000–15,300
దేవనూరు డీలక్స్	10,500–14,800
తాలు	5,300 – 8,000

–కొరిటెపాడు (గుంటూరు)

కమనీయ కార్తికానికి సంసిద్ధం

- ఇంద్రకీలాద్రిపై 22 నుంచి కార్తిక మాసోత్సవాలు
- 23న దుర్గమ్మకు గాజుల అలంకరణ
- భక్తులకు ఇబ్బందుల్లేకుండా పక్కా ఏర్పాట్లు
- మీడియాతో దుర్గగుడి చైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ తదితరులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై రానున్న రెండు నెలలో జరిగే విశేష పూజలు, పర్వ దినాలను పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని దుర్గగుడి చైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆవరణలోని మహా మండపం ఆరో అంతస్తులో గురువారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రానున్న రోజులలో దేవస్థానంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు, విశేష పర్వ దినాలు, భవానీ దీక్ష స్వీకరణలకు సంబంధించిన వివరాలను వివరించారు. తొలుత దేవస్థానం అమ్మవారి అలంకరణలు, ఆలయ బంగారు శిఖరం, రాజగోపురం ఫొటోలతో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఆధ్యాత్మిక సంరంభం..

అక్టోబర్ 21వ తేదీ సాయంత్రం అమ్మవారి ఆలయం, నటరాజ స్వామి వారి ఆలయం, మల్లేశ్వర స్వామి వారి ఆలయాల్లో ఆకాశదీపం వెలిగిస్తామని, 22వ తేదీ నుంచి కార్తిక మాసోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అక్టోబర్ 22వ తేదీ నుంచి నవంబర్ 20వ తేదీ వరకు నిర్వహించే మాసోత్సవాలలో ప్రతి నిత్యం స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు జరుగుతాయన్నారు. వీటితో పాటు ప్రతి రోజు సాయంత్రం 3 గంటలకు మల్లేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన, సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ ఉంటుందన్నారు. వీటితో పాటు కార్తిక మాసంలో వచ్చే విశేషమైన రోజుల్లో స్వామి వారికి బిల్వార్చన, కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం, మాస శివరాత్రి వంటి పర్వదినాలను విశేష పూజలు నిర్వహిస్తామన్నారు.

దుర్గమ్మ గాజుల సంబరం..

దుర్గమ్మకు 23వ తేదీన గాజులతో విశేష అలంకరణ చేస్తారని చైర్మన్, ఈవో పేర్కొన్నారు. అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణం, మూలవిరాట్‌కు గాజులతో విశేషంగా అలంకరిస్తామన్నారు. అమ్మవారికి అలంకరించిన గాజులను భక్తులకు పంపిణీ చేస్తామని వివరించారు.

ప్రత్యేక బిల్వార్చన జరిగే తేదీలు..

కార్తిక మాసంలో మల్లేశ్వర స్వామి వారికి ప్రత్యేక తిథులలో బిల్వార్చన నిర్వహిస్తారు. 27వ తేదీ సోమవారం శుద్ధ చవితి, నవంబర్ 1వ తేదీ శనివారం శుద్ధ ఏకాదశి, 3వ తేదీ సోమవారం శుద్ధ త్రయోదశి, 05వ తేదీ బుధవారం కార్తిక పౌర్ణమి, 10వ తేదీ సోమవారం బహుళ పంచమి, 15వ తేదీ శనివారం బహుళ ఏకాదశి, 17వ తేదీ సోమవారం బహుళ త్రయోదశి 18వ తేదీ మంగళవారం మాస శివరాత్రిన ప్రత్యేక బిల్వార్చన నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది.

20న దీపావళి వేడుకలు..

19వ తేదీ ధనత్రయోదశి పర్వదినం సందర్భంగా ఉదయం 8 గంటలకు దేవస్థాన యాగశాలలో శ్రీమహాలక్ష్మీ యాగం నిర్వహిస్తామని చైర్మన్, ఈవో తెలిపారు. ఈ యాగం దేవస్థానం తరఫున ఆలయ అర్చకులు నిర్వహిస్తారని, భక్తుల పరోక్ష సేవగా జరుగుతుందన్నారు. ఇక 20వ తేదీ దీపావళి పర్వదినాన ప్రదోషకాలంలో అమ్మవారి ప్రధాన ఆలయంలో ధనలక్ష్మీ పూజ, దీపాలంకరణ, దీపావళి వేడుకల అనంతరం రాత్రి 7 గంటలకు ఆలయ ద్వారాలను మూసివేస్తామన్నారు.

నవంబర్ 1 నుంచి భవానీ దీక్షలు

నవంబర్ 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు భవానీ మండల దీక్షలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అర్ధమండల దీక్షలు నవంబర్ 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు, డిసెంబర్ 4వ తేదీ కలశ జ్యోతి ఉత్సవం సత్యనారాయణపురంలోని శ్రీ శృంగేరి శారదాపీఠం పరిపాలిత శ్రీ శివరామకృష్ణ క్షేత్రం నుంచి ప్రారంభమవుతాయన్నారు. డిసెంబర్ 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు భవానీదీక్ష విరమణలు జరుగుతాయని, 15వ తేదీ ఉదయం 10 గంటలకు పూర్ణాహుతితో దీక్ష విరమణలు పరిసమాప్తమవుతాయన్నారు. మీడియా సమావేశంలో ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆలయ వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సతికి బదులు పతి హాజరు



ట్రస్ట్ బోర్డు సభ్యుల మధ్యలో అజయ్‌వర్మ ఠాకూర్

తన భార్య ట్రస్ట్ బోర్డు సభ్యురాలు.. అనివార్య కారణాలతో ఆమె ఇంకా ప్రమాణ స్వీకారం చేయలేదు. అయితే ఏంటీ.. తన భార్యను ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా నియమించడంతో ఆమె స్థానంలో భర్త దర్జాగా ఆలయ అధికారులతో పరిచయ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ తర్వాత జరిగిన మీడియా సమావేశంలోనూ మిగిలిన బోర్డు సభ్యుల మధ్యలో కూర్చొని ఆద్యంతం సమావేశం ముగింపు వరకు అక్కడే ఉన్నారు. ఈ ఘటన గురువారం దుర్గగుడిలో చోటు చేసుకుంది. దుర్గగుడి ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా పద్మావతి ఠాకూర్ నియమితులయ్యారు. అయితే గత శనివారం ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారానికి పద్మావతి ఠాకూర్ హాజరు కాలేదు. గురువారం నిర్వహించిన సమావేశానికి కూడా ఆమె హాజరుకాకపోగా, ఆమె స్థానంలో భర్త అజయ్ వర్మ ఠాకూర్ బోర్డు సభ్యులతో కలిసి సమావేశంలో పాల్గొనడం దుర్గగుడిలో చర్చనీయాంశంగా మారింది.

19న జిల్లా హేతువాద సంఘ మహాసభలు

బాపట్ల: బాపట్ల జిల్లా హేతువాద సంఘ మహాసభలు ఈ నెల 19వ తేదీన చీరాలలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు కరణం రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. చీరాలలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మీటింగ్ హాలులో మహాసభలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ మహాసభలో భారత హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.సత్యనారాయణ, ట్రెజరర్ షేక్ బాబు, సహాయ కార్యదర్శి కిషోర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

డిసెంబర్ 12 నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): క్రెడాయ్ గుంటూరు చాప్టర్ 8వ ప్రాపర్టీ షో బ్రోచర్ ఆవిష్కరణ గురువారం ఇన్నర్ రింగ్ రోడ్డులోని ఓ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రెరా చైర్మన్ ఆరే శివారెడ్డి, ఏపీ రెరా మెంబర్ దామచర్ల శ్రీనివాసరావు, ది గుంటూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బోనబోయిన శ్రీనివాసరావు, క్రెడాయ్ ఏపీ మాజీ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్ గుంటూరు చాప్టర్ వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన సేవలు అందించడం అభినందనీయమని తెలిపారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు సొంతింటి కలను నెరవేర్చుకోవడానికి ప్రాపర్టీ షోను డిసెంబర్ 12, 13, 14వ తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఇందులో నాణ్యమైన అపార్ట్‌మెంట్లు, స్థలాల వివరాలతో పాటు బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించిన స్టాల్స్ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ జాయింట్ సెక్రటరీ, ప్రాపర్టీ షో కన్వీనర్ టి.వినోద్‌రెడ్డి, గుంటూరు చాప్టర్ చైర్మన్ అరుమళ్ల సతీష్‌రెడ్డి, ప్రెసిడెంట్ మామిడి రాము, సెక్రటరీ మెట్టు సాంబశివారెడ్డి, ట్రెజరర్ ఏ.వి. నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఎంబీఏ ఐబీ కోర్సు ఫలితాలు విడుదల

ఏఎన్‌యు(పెదకాకాని): ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ (ఐబీ) కోర్సు రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను నాగార్జున విశ్వవిద్యాలయం సీఈ ఆలపాటి శివప్రసాదరావు బుధవారం విడుదల చేశారు. 60మంది పరీక్షలు రాయగా 57మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంపీఏ థియేటర్ ఆర్ట్స్ కోర్సు 2వ సెమిస్టర్‌లో 11మందికి గానూ ఐదుగురు ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యుయేషన్‌కు ఈనెల 27వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.1860 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సీఈ సూచించారు. అనంతరం వర్సిటీ పరిధిలో బీటెక్ కోర్సు 1/4 మొదటి సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. 350 మందికి గానూ 123 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. రీవాల్యుయేషన్‌కు ఈనెల 27లోగా ఒక్కో పేపర్‌కు రూ. 2,070 చెల్లించాలని సూచించారు.

శునకాల దాడిలో 15 గొర్రెలు మృతి



చనిపోయిన గొర్రెలు

బల్లికురవ: మండంలోని కొప్పరపాడులో కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి చెందాయి. బుధవారం అర్ధరాత్రి గ్రామంలోని బీసీ కాలనీలోని షేక్‌వలి గొర్రెల దొడ్డిలోకి ప్రవేశించిన శునకాలు వాటిపై దాడి చేసి చంపేశాయి. సుమారు వంద గొర్రెలను మేపుతూ వలి జీవనాన్ని వెళ్లదీస్తున్నాడు. కుక్కల దాడితో 15 చనిపోగా, గాయపడిన వాటిని స్థానిక పశు వైద్యశాలకు తీసుకెళ్లి వైద్యం చేయిస్తున్నారు. కుక్కకాటుకు గురవడంతో బతకడం కష్టమేనని వివరించారు. ప్రభుత్వపరంగా ఆదుకోవటంతో పాటు గ్రామంలో కుక్కలకు అడ్డుకట్ట వేయాలన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బుర్రి ఆదినారాయణ, మూడావత్ దానానాయక్‌లు చనిపోయిన గొర్రెలను పరిశీలించారు. కుక్కలు ఏడాదిగా పలువుర్ని కరిచాయని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. తాను రూ.2 లక్షల వరకు నష్టపోయానని వలి తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్ట్

కారంచేడు: గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న నలుగురు జూదరులను కారంచేడు పోలీస్‌లు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ షేక్ ఖాదర్‌బాషా తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఆదిపూడి గ్రామంలో కొందరు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేశారు. గ్రామంలోని పశువుల కొట్టం వద్ద పరదాలు వేసుకొని చాటుగా పేకాడుతున్న నలుగుర్ని అరెస్ట్ చేశారు. పేకలు, సెల్‌ఫోన్‌లు, రూ.7,020 నగదు స్వాధీనం చేసుకున్నారు.

19న 'మట్టి రంగు' పుస్తకావిష్కరణ

బాపట్ల: ప్రముఖ కవయిత్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత డా. చిల్లర భవానీదేవి రచించిన 'మట్టి రంగు' కవితా సంపుటి పుస్తకావిష్కరణ మహోత్సవం ఈ నెల 19వ తేదీ సాయంత్రం 6 గంటలకు స్థానిక హోటల్ గౌతం వేదిక హాలులో జరగనుంది. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం ఉంటుందని బాపట్ల జిల్లా రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తిమ్మన శ్యామ్ సుందర్ తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. రచయిత్రి డా. వెలువోలు నాగరాజ్యలక్ష్మి సభాధ్యక్షత వహించనున్నారని, సాహితీ విమర్శకులు డా. బీరం సుందరరావు పుస్తక పరిచయాన్ని చేస్తారని, ఆత్మీయ అతిథిగా ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి డా. పి.సి. సాయిబాబు పాల్గొననున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా కోటంరాజు సత్యనారాయణ శర్మ దంపతుల స్మారక సాహితి పురస్కారాన్ని డా. అప్పాజోస్యుల సత్యనారాయణకు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి



కారంచేడులో టపాసుల గోదాములను పరిశీలిస్తున్న చీరాల డీఎస్పీ, ఆర్డీఓలు

కారంచేడు: దీపావళి సమీపిస్తున్న తరుణంలో చీరాల సబ్ డివిజన్ పరిధిలో ఉన్న బాణసంచా గోదాముల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని, దుకాణాలకు అనుమతులు తీసుకోవాలని చీరాల డీఎస్పీ మహ్మద్ మొయిన్, చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్‌నాయుడు స్పష్టం చేశారు. గురువారం మండలంలోని స్వర్ణ, కారంచేడుతోపాటు చీరాల, వేటపాలెం మండలాల్లో కూడా బాణసంచా గోదాములను వారు తనిఖీ చేశారు. నిబంధనల మేరకు నిల్వ చేయాలన్నారు. తగిన జాగ్రత్తలను పాటించాలని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి హాని జరగని విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధరల విషయంలో పట్టికలు వినియోగదారులకు అందుబాటులో ఉంచాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు నష్టం కలిగించని విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కారంచేడు తహసీల్దారు జి.నాగరాజు, చీరాల ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ, కారంచేడు ఎస్‌ఐ షేక్ ఖాదర్ బాషా, మండల రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, గోదాముల నిర్వాహకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

వేటపాలెం: స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.నహిద గురువారం తెలిపారు. ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన డివిజన్ స్థాయి ఆటల పోటీల్లో ఆ విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. అండర్– 17 విభాగంలో 100 మీటర్లు, 400 మీటర్లు పరుగు పందెంలో కాటం రాజు, 200 మీటర్లలో కిషోర్, కబడ్డీలో కాటంరాజు, చెస్‌లో గోపీకృష్ణ, వాలీబాల్‌లో కిషోర్, 3 కి.మీ., 5 కి.మీ. పరుగు పందెంలో గహత్, శ్రీను ప్రతిభ చాటారన్నారు. అండర్ 14 విభాగంలో 200 మీటర్లు, 400 మీటర్లు, వాలీబాల్‌లో వినయ్‌కుమార్, 400 మీటర్లలో సతీష్‌కుమార్, చెస్‌లో దేవరాజు, ఖోఖోలో చందు ప్రతిభ చూపారని పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను పీఈటీ కె. మమత, ఉపాధ్యాయులు అభినందించారు.

కోనేరులోకి దూకి మహిళ ఆత్మహత్య



కామాక్షి మృతదేహం

మంగళగిరి టౌన్: స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి చెందిన పెద కోనేరులోకి దూకి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళగిరి నగరంలో గురువారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు... మంగళగిరి నగర పరిధిలోని గండాలయ్యపేటకు చెందిన చలంచలం కామాక్షి (29) తల్లి ధనలక్ష్మితో కలసి జీవిస్తోంది. కొన్నేళ్ల కిందట అనారోగ్యంతో భర్తతో పాటు పిల్లలు కూడా చనిపోయారు. పలు ఆలయాల వద్ద భిక్షాటన చేసుకుంటూ తల్లీకూతుళ్లు జీవనం సాగిస్తున్నారు. కామాక్షి కొంతకాలంగా విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతోందని, మానసిక ఆరోగ్య పరిస్థితి కూడా సరిగా లేదని తల్లి ధనలక్ష్మి పేర్కొంది. గురువారం మధ్యాహ్నం కోనేరు వద్దకు వెళ్లి ప్రహరీ ఎక్కి కోనేటిలోకి దూకేసింది. సమీపంలో కొందరు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న మంగళగిరి పట్టణ పోలీసులు సమీపంలోని సీసీ కెమెరా పుటేజీను పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి కామాక్షి మృతదేహాన్ని వెలికి తీశారు. సంఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా కోనేరు చుట్టూ ఫెన్సింగ్ ఉంటే ఇలాంటి ఘటనలు జరగకుండా ఉంటాయని స్థానికులు తెలిపారు. కోనేరుకు మూడు పక్కలా ఫెన్సింగ్ ఉందని, దక్షిణం వైపు మాత్రం లేకపోవడం వల్లే ఈ ఘటనకు కారణమని వ్యాఖ్యానిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దక్షిణం వైపు కూడా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

రైల్వే పోలీసుల అదుపులో నిందితుడు

తెనాలి రైల్వే స్టేషన్‌లో అరెస్టు చేసిన జీఆర్పీ పోలీసులు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్)/, సత్తెనపల్లి: మూడు రోజు కిందట సంత్రగచి ఎక్స్‌ప్రెస్ రైలులో రాజమండ్రికి చెందిన ప్రయాణికురాలిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని తెనాలి రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ పోలీసులు గురువారం అదుపులో తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. వివరాలు.. సంత్రగచి ఎక్స్‌ప్రెస్ రైలులో రాజమండ్రి ప్రాంతానికి చెందిన ఓ మహిళ మంగళవారం చర్లపల్లి వరకు ప్రయాణించేందుకు మహిళా బోగిలో కూర్చుంది. గుంటూరు రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే బోగిలో ఉన్న మహిళలంతా దిగి పోయారు. బోగిలో బాధితురాలు మాత్రమే ప్రయాణం చేస్తోంది. ఈ సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి బోగిలోకి ఎక్కి, ఆమెను కత్తితో బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. సెల్‌ఫోన్, రూ.5600 లాక్కొని పెదకూరపాడు రైల్వే స్టేషన్ సమీపంలో దిగి పరారయ్యాడు. దీంతో బాధితురాలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు ఫిర్యాదును నడికుడి జీఆర్పీ పోలీసులకు బదిలీ చేశారు. దీంతో ఇక్కడి రైల్వే పోలీసులు తక్షణమే అప్రమత్తమయ్యారు. సీసీ కెమెరాల ద్వారా అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి కోసం గాలింపులు ప్రారంభించారు. అయితే, దర్యాప్తులో అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి పల్నాడు జిల్లా, సత్తెనపల్లి ప్రాంతానికి చెందిన వాడుగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం తెనాలి రైల్వే స్టేషన్‌లో అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని జీఆర్పీ పోలీసులు అదుపులో తీసుకున్నట్లు సమాచారం. అతడిపై పాత నేరాలు ఏమైనా ఉన్నాయా ? అనే కోణంలో విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

గంజాయి స్వాధీనం

పెదకాకాని: నగర శివారులోని బసవతారక రామనగర్ సమీపంలో ఇద్దరు గంజాయి తాగుతుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 250 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఎర్ల వెంకటచిన్న, గుంజి మోహన్‌లుగా గుర్తించారు. ప్రాథమిక విచారణలో వారికి విక్రమ్ అనే వ్యక్తి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం సీఐ టి.పి. నారాయణస్వామి తెలిపారు.

'కపాస్ కిసాన్'యాప్‌తో పలు ఉపయోగాలు

కొరిటెపాడు(గుంటూరు): 'కపాస్ కిసాన్' యాప్‌తో పత్తి రైతులకు పలు ఉపయోగాలున్నాయని, వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జనరల్ మేనేజర్ రాజేంద్ర షా గురువారం ఒక ప్రకటనలో సూచించారు. 2025–26 పంట కాలంలో సీసీఐ మద్దతు ధర(ఎంఎస్‌పీ)తో పత్తి విక్రయాలకు 'కపాస్ కిసాన్' మొబైల్ యాప్‌లో నమోదుకావాలని ఆయన తెలిపారు. యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, ఆపిల్ ఐఓఎస్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, మొబైల్ ఫోన్ నంబరుకు వచ్చే ఓటీపీ ద్వారా లాగిన్ కావాలని ఆయన సూచించారు. మద్దతు ధరకు విక్రయానికి యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా పత్తి రైతుల ప్రయోజనాల కోసం, కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) పథకం కింద ప్రయోజనాలను పొందడానికి తప్పనిసరిగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

రైలులో గంజాయి పట్టివేత



తెనాలి రూరల్: రైలులో తరలిస్తున్న గంజాయిని తెనాలి జీఆర్పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాటా నగర్ నుంచి ఎర్నాకులం వెళ్లే రైలులో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో జీఆర్పీ ఎస్‌ఐ జి. వెంకటాద్రిబాబు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. రైలు గురువారం తెనాలి చేరుకోగానే బోగీల్లో తనిఖీలు చేపట్టారు. ఎస్–3 బోగీలోని ఓ బ్యాగులో 4.4 కిలోల గంజాయిని గుర్తించి సీజ్ చేశారు. వెంటనే తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు సమాచారమందించి, ఆయన సమక్షంలో సీజ్ చేశారు. గంజాయి తరలిస్తున్న వ్యక్తి పరారయ్యాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మత్స్యకారులకు నిత్యావసర సరుకులు పంపిణీ

చొరవ చూపించిన మంత్రి నారా లోకేష్

సాక్షి ఎఫెక్ట్



సరుకులు అందజేస్తున్న టీడీపీ నేతలు

తాడేపల్లి రూరల్: కృష్ణా నదిలో వరదల కారణంగా వల విసరక మత్స్యకారులకు భుక్తి కరువైంది. దయనీయంగా జీవిస్తున్నారని సాక్షిలో అక్టోబర్ 1వ తేదీన కథనం వెలువడింది. దీనికి స్పందించిన మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే, ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ ఆర్థిక సాయంతో గురువారం మత్స్యకారులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి గంగపుత్రులు వేట లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మంత్రి లోకేష్ సహాయంతో 300 మందికి రెండు వేల రూపాయల చొప్పున నిత్యావసర వస్తువులను అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘ నాయకులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పత్తిలో పూత రాలడాన్ని నివారించాలి

కేంద్రీయ సస్య రక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి కె. వీరయ్య చౌదరి



పెదగొట్టిపాడులో పత్తి పంటను పరిశీలిస్తున్న వీరయ్య చౌదరి, ఏవో తదితరులు

ప్రత్తిపాడు: పత్తిలో పూత రాలడాన్ని నివారించే దిశగా రైతులు చర్యలు తీసుకోవాలని కేంద్రీయ సస్య రక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి కె. వీరయ్య చౌదరి సూచించారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడులో గురువారం ఓ పత్తి పొలంలో పొలంబడి నిర్వహించారు. స్థానిక మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణా బేగంతో కలిసి వీరయ్య చౌదరి పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధిక తేమ కారణంగా పత్తిలో పూత రాలడంతో పాటు పలు తెగుళ్లు, పురుగులను గమనించారు. నివారణకు తీసుకోవలసిన చర్యలను రైతులకు వివరించారు. పూత రాలడాన్ని నివారించేందుకు ఎకరానికి కేజీ 19–19–19 లేదా 13–0–45 పిచికారీ చేయాలని సూచించారు. పంటలో అక్కడక్కడా పచ్చ దోమ కూడా ఉందని, నివారణకు ఫిప్రోనిల్ 2 ఎం.ఎల్. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 ఎం.ఎల్. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. అల్లిక రెక్కల పురుగు వంటి మిత్ర పురుగులను కూడా అధికంగా గమనించామని, ప్రస్తుత పరిస్థితుల్లో పురుగు మందులను ఎక్కువగా వాడనవసరం లేదని సూచించారు. అధిక వర్షాలకు సోకుతున్న ఆకుమచ్చ తెగులు నివారణకు ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్, కాపర్ ఆక్సి క్లోరైడ్ 30 గ్రాములు పది లీటర్ల నీటికి కలిపి రెండు లేదా మూడుసార్లు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ షణ్ముఖ్, రైతులు పాల్గొన్నారు.